




దిన పత్రిక

# తొలి సమయం

వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 57 బుధవారం 26-02-2025 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..


# ఎన్నో ఏళ్ల కల నెరవేరబోతున్న వేళ..

- మార్చి 1 నుంచే కొత్త రేషన్‌కార్డులు - లక్ష కార్డులు పంపిణీ చేయనున్న అధికారులు



**హైదరాబాద్,ఫిబ్రవరి25:** ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం శుభవార్తను అందించింది. గత పదేళ్లకు పైగా అన్ని అర్హతలు ఉన్న తెల్లరేషన్‌కార్డు లేకపోవడంతో అనేక మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు ఇస్తామని హామీ ఇచ్చింది. ఆ హామీ మేరకు మార్చి ఒకటి నుంచి కొత్త రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు రేవంత్ రెడ్డి సర్కార్ ప్రకటించింది. మార్చి ఒకటిన ఒకే రోజు లక్ష కార్డులు జారీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ మేరకు హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో లక్ష కార్డులను అధికారులు పంపిణీ చేయనున్నారు. కొత్త జిల్లాల ప్రకారం.. హైదరాబాద్- 285, వికారాబాద్ జిల్లా- 22 వేలు, నాగర్‌కర్నూల్ జిల్లా- 15 వేలు, నారాయణపేట జిల్లా- 12 వేలు, వనపర్తి జిల్లా- 6 వేలు, మహబూబ్‌నగర్ జిల్లా- 13 వేలు, గద్వాల్ జిల్లా- 13 వేలు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా- 6 వేలు, రంగారెడ్డి జిల్లా- 24 వేలు చొప్పున లక్ష కార్డులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మార్చి 8 తర్వాత అన్ని జిల్లాల్లో పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. కాగా, 2014 నుంచి తెలంగాణలో నూతన రేషన్ కార్డులు జారీ చేయలేదు. ఈ పదేళ్లలో లక్షల మంది వివాహాలు చేసుకుని వేరుకాపురాలు పెట్టారు. ప్రభుత్వ పథకాలు ఏమైనా అందాలంటే రేషన్ కార్డులు కీలకం. కార్డులు లేక అనేక మంది సంక్షేమ పథకాలను కోల్పోయిన సందర్భాలూ అనేకం ఉన్నాయి. ఈ సమస్యను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలకు నూతన కార్డులు జారీ చేస్తున్నట్లు తీపి కబురు చెప్పింది. ఇందులో భాగంగానే ఈ ఏడాది జనవరి 26న కూడా 16,900 కుటుంబాలకు రేషన్ కార్డులు మంజూరు చేశారు. మరోసారి ఈ ప్రక్రియ చేపట్టి మరికొన్ని కుటుంబాలకు లబ్ధి చేకూర్చేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే ప్రజాపాలన, గ్రామ సభల్లో దరఖాస్తులు స్వీకరించిన అధికారులు.. తాజాగా మీ సేవా కేంద్రాల ద్వారా కూడా అప్లికేషన్లు తీసుకుంటున్నారు. వాటిని పరిశీలించిన అనంతరం అర్హులకు నూతన కార్డులను మంజూరు చేయనున్నారు.

## తెలంగాణకు ఎక్కడ అడ్డుపడ్డానో రుజువు చేయగలవా...

సిఎం వ్యాఖ్యలపై మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్,ఫిబ్రవరి25:** రేవంత్ రెడ్డికి దమ్ము ఉంటే తాను ఎప్పుడు ఎక్కడ తెలంగాణకు అడ్డుపడ్డానో రుజువు చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. పదవుల కోసం పార్టీలు మారి కాళ్లు పట్టుకొనే వాడిని తాను కాదని తేల్చిచెప్పారు. ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం రేవంత్ చేతిలో ఉంది.. ఆయన ఎలాంటి విచారణ చేస్తారో చేసి తమకు అప్పగించాలని కిషన్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా విమర్శలు చేయడం వల్లనే తాను గట్టిగా సమాధానం ఇవ్వాల్సి వస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. తన రాజకీయ జీవితంలో ఏనాడూ పదవుల కోసం పాకులాడలేదని స్పష్టం చేశారు. దేశం మీద భక్తితో, జెండా మీద గౌరవంతో బీజేపీలో మాములు కార్యకర్తగా వచ్చి ఈ స్థాయికి వచ్చానని అన్నారు. కేంద్రమంత్రి హోదాలో ఉన్న తనను పట్టుకొని తెలంగాణకు అడ్డుపడ్డ వ్యక్తి అంటూ మాట్లాడటం రేవంత్ దిగజారుడు తనానికి నిదర్శనమని మండిపడ్డారు. ఇలాంటి వ్యాఖ్యలు సరికాదన్నారు.

## ఆప్ మద్యం విధానంతో 2వేల కోట్లు నష్టం

**ఢిల్లీ అసెంబ్లీలో కాగ్ నివేదిక ప్రవేశ పెట్టిన ప్రభుత్వం**

**అసెంబ్లీ సమావేశాల్లో గందరగోళం...ఆప్ సభ్యుల సస్పెన్షన్**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి25:** దేశ రాజధాని దిల్లీలో గత ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం విధానంపై కాగ్ రూపొందించిన నివేదిక అంశం ఎన్నికల ముందు పెనుదుమారం రేపింది. ఈ నివేదికను తాజాగా భాజపా సర్కారు అసెంబ్లీలో ప్రవేశపెట్టి అందులోని అంశాలను బయటపెట్టింది. 2021-22లో తీసుకొచ్చిన మద్యం విధానం కారణంగా దిల్లీ ప్రభుత్వానికి రూ.2000 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు కాగ్ తేల్చింది. నిపుణుల అభిప్రాయాలు తీసుకోకపోవడం, ఫిర్యాదులు వచ్చినా బిడ్డింగును అనుమతించడం, ఉల్లంఘనలకు జరిమానా వేయకపోవడం, విధానాల రూపకల్పనలో పారదర్శకత లేకపోవడం వంటివి చోటుచేసుకున్నాయని కాగ్ దర్యాప్తులో తేలింది. కొత్త మద్యం విధానం కారణంగా అప్పటి ప్రభుత్వం రూ.941.53 కోట్ల ఆదాయం కోల్పోయిందని నివేదికలో పేర్కొంది. ఇక, లైసెన్సు ఫీజుల కింద మరో రూ.890.15 కోట్లు నష్టపోయినట్లు తెలిపింది. లైసెన్సుదారులకు మినహాయింపుల రూపంలో మరో రూ.144 కోట్లు కోల్పోయినట్లు వెల్లడించింది. ఈ నూతన మద్యం విధానాన్ని అప్పటి కేజ్రీవాల్ సర్కారు తీసుకొచ్చింది. దీనిపై విమర్శలు రావడంతో కొన్ని నెలలకే దాన్ని వెనక్కి తీసుకుంది.

## బీఆర్ఎస్ లేకుండా చేయాలని బీజేపీ, కాంగ్రెస్ కుట్రలు

**ఎన్ని కుట్రలు చేసినా జనం గుండెల్లో నిలిచేది బీఆర్ఎస్సే**

**హామీల పేరుతో గద్దెనెక్కి.. మాటమార్చిన రేవంత్**

**కాంగ్రెస్ అంటేనే కరువు : మాజీ మంత్రి కేటీఆర్**



**హైదరాబాద్,ఫిబ్రవరి25:** రాష్ట్రంలో బీఆర్ఎస్ లేకుండా బీజేపీ, కాంగ్రెస్‌లు కలిసి కుట్రలు పన్నుతున్నాయని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. కానీ వారు ఎన్ని కుట్రలు చేసినా ప్రజల గుండెల్లో నిలిచేది బీఆర్ఎస్సే అని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన మాజీ జడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ సీనియర్ నేత మల్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కేటీఆర్ గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పేదింటి ఆడపిల్లల వివాహాలకు రూ. లక్షతో పాటు తులం బంగారం ఇస్తానని చెప్పి మోసం చేశారన్నారు. రూ. 15 వేలు రైతు భరోసా, రూ. 2 లక్షలు రుణమాఫీ చేస్తా అని మాయమాటలు చెప్పారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చి 450 రోజులు అవుతుందని.. రోజుకు ఒకరి చొప్పున 450 మంది రైతులు ఆత్మహత్య చేసుకుకున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఇలాంటి పరిస్థితి ఉందా అని ప్రశ్నించారు. భారతదేశంలో రైతు ఆత్మహత్యలు అత్యధికంగా తగ్గించింది కేసీఆర్ ప్రభుత్వం అని కేంద్రం పార్లమెంట్‌లో చెప్పిందని గుర్తు చేశారు. మరి కాలం తెచ్చిన కరువా..? కాంగ్రెస్ తెచ్చిన కరువా..? అర్థం చేసుకోవాలన్నారు. కేసీఆర్ మీద కోపంతోనే మేడిగడ్డ రిపేర్ చేయడం లేదని ఆరోపించారు. శివుడు గంగను కిందకు తీసుకువస్తే.. కేసీఆర్ గంగను పైకి తెచ్చిండని పేర్కొన్నారు. కానీ రైతులకు మాయమాటలు చెప్పి ఓట్లు కొల్లగొట్టారు అని కేటీఆర్ తెలిపారు. కాళేశ్వరంలో ఒక బ్యారేజ్‌లో ఒక పర్రె వడితే.. దానికి కాంగ్రెస్ నేతలతో పాటు మీడియా ప్రతినిధులు కూడా లొల్లి పెట్టిండ్రు. మరి ఇవాళ సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిపోతే ఎవరు మాట్లాడరు. కాంగ్రెస్, బీజేపోడు నోరెత్తడు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలిపోతే మాట్లాడరు. ఖమ్మం వద్ద పెద్దవాగు కొట్టుకుపోతే ఎవరు మాట్లాడరు. రేవంత్ రెడ్డికి రక్షణ కవచంలా బీజేపీ ఉంది. కాళేశ్వరంలో ఒక పిల్లర్‌కు పర్రె వడితే.. ఎన్డీఎస్‌ఏ వాలిపోయింది. మరి ఇవాళ ఎస్ఎల్‌బీసీలో టన్నెల్ కూలి దాదాపు 72 గంటలు అవుతుంది మరి ఎందుకు ఎన్డీఎస్‌ఏ రాలేదు. ఏ బీజేపోడు మాట్లాడడు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎందుకు మాట్లాడం లేదు. ఏం ఇబ్బంది వచ్చింది. సుంకిశాల కూలిపోతే గవినోళ్ల శ్రీనివాస్ ఆర్టీఐ కింద రఖాస్తు పెట్టుకుంటే.. ఇది దేశ భద్రతకు సంబంధించిన అంశం.. సమాధానం ఇవ్వమని చెప్పారు అని కేటీఆర్ గుర్తు చేశారు. ఈ రెండే కాదు.. ఎన్నికల ప్రచారంలో మోదీ వచ్చి.. కాంగ్రెస్ పార్టీ అవినీతి ప్రభుత్వాన్ని నడుపుతుంది.. ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ప్రధాని గర్జించిండు. కానీ ఇంత వరకు చర్య లేదు. రేవంత్ రెడ్డి బామ్మర్ది కంపెనీ శోధా 2 కోట్ల లాభం ఆర్జించింది. అమృత్ స్కీంలో రూ. 1137 కోట్ల కాంటాక్ట్ ఇచ్చిండు బామ్మర్ది కంపెనీకి రేవంత్ రెడ్డి. దీని మీద విచారణ చేయాలని సంబంధిత కేంద్రమంత్రికి ఫిర్యాదు చేశాం. ఆరు నెలలు అవుతంది.. ఇప్పటి వరకు స్పందన లేదు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఈడీ రైడ్ అయింది.. ఏం జరిగిందో తెలియదు కానీ ఇప్పటి వరకు ఎవరూ నోరు విప్పడం లేదు. ఇవన్నీ దేనికి సంకేతం.. ఎవరు ఎవర్ని కాపాడుతున్నారు. రేవంత్ రెడ్డి బీజేపీ మీద పల్లెత్తు మాట మాట్లాడం లేదు. కేసీఆర్ మీదనే మాట్లాడుతున్నడు. ఈ రాష్ట్రంలో కేసీఆర్ పార్టీ ఉంటే.. కాంగ్రెస్, బీజేపీ ఆటలు సాగవని తెలుసు కాబట్టి.. ఆ ఇద్దరు కలిసి కేసీఆర్ పార్టీని ఖతం చేయాలన్నదే ఆలోచన. అసెంబ్లీ ఎన్నికల్లో కుమ్మక్కై సక్సెస్ అయ్యారని కేటీఆర్ తెలిపారు.

## ట్రిలియన్ డాలర్ల ఆర్థికశక్తిగా తెలంగాణ

**లైఫ్ సైన్సెస్ రంగంలో గణనీయమైన ప్రగతి**

**బయో ఏషియా సదస్సుతలో సిఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్,ఫిబ్రవరి25:** ప్రతి ఏటా నిర్వహించే బయో ఏషియా సదస్సు హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ లైఫ్ సైన్సెస్ రాజధానిగా నిలబెట్టిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హెల్త్ కేర్ రంగం భవిష్యత్ నిర్దేశించటంతోపాటు ప్రపంచానికే మార్గదర్శనం చేసేలా బయో ఏషియా దేశ విదేశాలను ఆకర్షిస్తోందని చెప్పారు. దీని ద్వారా అంతర్జాతీయ స్థాయిలో పేరుపొందిన ఫార్మా, హెల్త్ కేర్, లైఫ్ సైన్స్, బయోటెక్ కంపెనీలు ఎన్నో హైదరాబాద్ నుంచి పనిచేస్తున్నాయని సీఎం చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో నిర్వహించిన బయో ఏషియా-2025 కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..'రాబోయే 10 సంవత్సరాలలో తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకే పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలను అందించే సంస్థలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోంది. మేము ఇంతకాలం ఉన్నత విద్యపై పెట్టుబడులు పెట్టాం. ఎందరో శాస్త్రవేత్తలు, శాస్త్ర, సాంకేతిక నిపుణులు, ఇంజినీర్ల సమూహాన్ని తయారు చేశాం. జీనోమ్ వ్యాలీని కూడా ఏర్పాటు చేసుకున్నాం. హైదరాబాద్ కోర్ అర్బన్ సిటీ ఏరియా సేవల రంగానికి ప్రాధాన్యమిస్తాం. హైదరాబాద్ లో ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీతోపాటు ఎన్నో భారీ ప్రాజెక్టులు చేపడుతున్నాం. దేశంలో ఇప్పుడు హైదరాబాద్ ఎలక్ట్రిక్ వాహనాల రాజధానిగా అవతరించింది. దేశంలోనే అత్యధిక ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు ఇక్కడే జరుగుతున్నాయి. 3,000 ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీలో ప్రవేశపెడుతున్నాం. కోర్ సిటీ వెలుపల ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డు వరకూ మాన్యుఫ్యాక్షరింగ్ హబ్‌ను అభివృద్ధి చేస్తాం. ప్రపంచంలోని అతిపెద్ద తయారీ కేంద్రాలలో ఒకటిగా దీన్ని నెలకొల్పుతాం. ప్రపంచం నలుమూలాల నుంచీ పెట్టుబడులను ఆహ్వానిస్తాం. ఓఆర్ఆర్.. ఆర్ఆర్ఆర్.. ఈ రెండు రింగ్‌లను రేడియల్ రోడ్లతో అనుసంధానిస్తాం. ఈ రహదారులకు ఇరువైపులా క్లస్టర్లను అభివృద్ధి చేస్తాం. తెలంగాణ భూ పరివేష్టిత రాష్ట్రం. ఒక మెగా డ్రై పోర్టును అభివృద్ధి చేసి ఏపీలోని సీ పోర్టుకు అనుసంధానించేందుకు ప్రత్యేక రైలు, రోడ్డు రవాణా సదుపాయాలు మెరుగుపరుస్తాం. బయోసైన్సెస్, బయోటెక్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ప్రపంచంలోనే అత్యుత్తమ పర్యావరణ వ్యవస్థకు చిరునామాగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధి, తయారీ, నైపుణ్యాల కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ప్రణాళికతో పని చేస్తున్నాం. నిన్ననే హైదరాబాద్‌లో అమెజాన్ సంస్థ తమ కార్యకలాపాలను విస్తరించింది. ఇది మా సహకారానికి నిదర్శనం. తెలంగాణలో ఉన్న అనుకూలతలు, మా ప్రభుత్వ సహకారాన్ని అందుకోవాలని, మాతో భాగస్వామ్యం పంచుకోవాలని ప్రపంచస్థాయి దిగ్గజ కంపెనీలు అన్నింటినీ ఆహ్వానిస్తున్నాం. సులభమైన పారిశ్రామిక విధానం, మౌలిక సదుపాయాలు, ఆశించినంత మద్దతు అందించేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.

## 27న పట్టభద్ర, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు

**పోటాపోటీ నేతల రాకతో ముగిసిన ప్రచారం**

**ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి**

**నిజామాబాద్,ఫిబ్రవరి25:** కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ పట్టబద్రులు, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు ప్రచారం ముగిసింది. ఈనెల 27 న టీచర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ జరుగనుంది. గత 15 రోజులుగా ప్రచారాన్ని హోరెత్తించారు అభ్యర్థులు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ ఎన్నికలకు దూరంగా ఉంది. పట్టభద్రుల స్థానంలో బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ అభ్యర్థుల మధ్య ముక్కోణపు వార్ జరుగనుంది. బీజేపీ కాంగ్రెస్ అభ్యర్థుల తరుపున పార్టీ అగ్రనేతలు ప్రచారం చేశారు.. కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ పలువురు మంత్రులు ప్రచారం చేయగా.. బీజేపీ అభ్యర్థికి మద్దతుగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.. బండి సంజయ్ పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేల ప్రచారం చేశారు. ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశారు అధికారులు. నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో 3,55,159 మంది పట్టబద్ర ఓటర్లు, 27088 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. గ్రాడ్యుయేట్ స్థానంలో 499 పోలింగ్ కేంద్రాలు, టీచర్ స్థానంలో 274 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు అధికారులు.

ఈనెల 27 న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. మార్చి 3 న ఓట్ల లెక్కింపు ఉంటుంది. అయితే.. మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల స్థానంలో 56 మంది పోటీలో ఉండగా..మొత్తం ఓటర్లు 3,41,313 మంది ఉండగా పురుషులు 2,18,060 మంది, మహిళలు 1,23,250 మంది, ఇతరులు ముగ్గురు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గంలో టీచర్ల స్థానంలో 15 మంది పోటీ ఉండగా మొత్తం ఓటర్లు 25,921 మంది ఉండగా పురుషులు 16,364 మంది, మహిళలు 9,557 మంది ఉన్నారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గంలో 19 మంది పోటీలో ఉండగా.. మొత్తం ఓటర్లు 24,905 మంది ఉండగా పురుషులు 14,940 మంది, మహిళలు 9,965 మంది ఉన్నారు.

# "రచ్చ కోటలో ఆదివాసి రాజ్ గోండ్ తెగ"
# వారిచే ప్రత్యేక శివరాత్రి పూజలు

**ఆడెల్లి పోచమ్మ, రాజ రాజేశ్వర స్వామికి**
**ప్రత్యేక పూజలు నిర్వహించిన జాలిష్ పంద్రం మహారాజ్**
**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆదివాసీ 9తెగల**
**సమన్వయకర్త కోయ పుణ్యం ధర్మప్రచారక్ చుంచు రామకృష్ణ**





**తొలి సమయం డెస్క్ హైదరాబాద్ ఫిబ్రవరి 25:** నిర్మల్ జిల్లా మామిడ మండలం రచ్చ కోట గ్రామంలో ఆదివాసి రాజ్ గోండ్ తెగ ఆధ్వర్యంలో మహాశివరాత్రి గోండ్ సంప్రదాయ ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. గోంపై తెగల ఆరాధ్య దైవం అడెల్లి పోచమ్మ శ్రీ రాజరాజేశ్వర స్వామికి పంద్రం జాలిష్ రావు మహారాజ్ చే గోండి సంప్రదాయ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నైవేద్యం సమర్పిస్తూ హారతులు వెలిగించారు.

ఈ కార్యక్రమంలో ఆదివాసీ 9 తెగల సమన్వయకర్త కోయ పుణ్యం ధర్మ ప్రచారక్ చుంచు రామకృష్ణ, ఇరుపవెంకటేశ్వర్లు మరియు ఈ ప్రాంత ఆదివాసీ రాజ్ గోండ్ తెగ భక్తులు బీమ్ రావ్ సార్ మేడి,పంద్రం కిషన్ రావు,పంద్రం బాపు రావు, పంద్రం పొల్లు సిడం భారత్, తొడసాం భూమన్న రామ్ పూర్, భూరదపల్లి, పెండల్ దారి, మంచిర్యాల, కాసిపేట్ సోనాపూర్ గ్రామాలరాజ్ గోండి ఆదివాసి తెగల వారు పాల్గొన్నారు





# ఆదర్శ నాయకుడు అయితే ముఖ్యమంత్రిని కలిసే విధానం తెలియదా

**ఇల్లందు వ్యవసాయశాఖ చైర్మన్,రాంబాబు,**
**మండల అధ్యక్షుడు పులి సైదులు హెచ్చరిక**



**తొలిసమయం, ఇల్లందు ఫిబ్రవరి 25**
ఐదుసార్లుగా ఎమ్మెల్యేగా గెలిచిన ఆదర్శ నాయకుడు గుమ్మడి నరసయ్య ముఖ్యమంత్రి గారిపై విమర్శలు చేయడం సరికాదని, ముఖ్యమంత్రి ని కలవాలంటే అపాయింట్మెంట్ కోసం విధినాలు పాటించాలని, మరియు కాంగ్రెస్ పార్టీపై బురదల్లే ప్రయత్నం మానుకోవాలని, అమర్యాదగా మాట్లాడితే కాంగ్రెస్ శ్రేణులు సహించరని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి టిఆర్ఎస్ సఖ్యతతో వ్యవహరిస్తున్న తీరు అందరికీ తెలుసనీ పేర్కొన్నారు. గత అసెంబ్లీ టికెట్ తన కూతురి కోసం ప్రయత్నించిన తీరు అందరికీ తెలుసు అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ని విమర్శించే స్థాయి తనకు లేదని హెచ్చరించారు. గిరిజన ప్రాంతాలు కాంగ్రెస్ హయాంలో మెరుగుపడ్డాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మండల రాము, మండల కార్యదర్శి కిరణ్, హరికృష్ణ, మాజీ సర్పంచులు పాయాం స్వాతి, కల్తీ పద్మ, తదితర కాంగ్రెస్ శ్రేణులుపాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు అండగా ఉంటాం : కల్పనా చౌదరి

**తొలిసమయం, కొత్తగూడెం ఫిబ్రవరి 25 :**



కొల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్లలో ఏర్పాటు చేసిన అదునాతన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని కొల్లి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్పనా చౌదరి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి మహిళలు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్పనా చౌదరి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందు ఉండాలని, అభివృద్ధి పథంలో వెళ్లాలని ఆర్థికంగా బలోపేతం అవుతు మహిళా సాధికారత దిశగా అడుగులు వేయాలని అందుకు అన్ని రకాలుగా కొల్లి ఫౌండేషన్ సహకరిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ రూప్లానాయక్, ఖమ్మం జిల్లా ఇన్చార్జి మూడు సురేష్, బోబ్బెల రమేష్, భూక్య కిషన్, కొల్లి ఫౌండేషన్ కుటుంబ సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# తుడుందెబ్బ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**- ఉద్యమాల తోనే హక్కులు సాధించు కుందాం... - తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు సనప కోటేశ్వర రావు**



**తొలి సమయం :భద్రాద్రి కొత్తగూడెం ఫిబ్రవరి 25**
ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ)జిల్లా కమిటీ సమావేశం పాల్వంచ లో గల కొమరం భీం హాల్ లో జరిగింది,ఈ సమావేశం లో జిల్లా లో గల భూ సమస్యలు,ఆదివాసీలపై జరుగుతున్న దాడుల పై చర్చించినారు అనంతరం జిల్లా అధ్యక్షులు సనప కోటేశ్వర రావు పాల్గొని మాట్లాడుతూ ఏప్రిల్ 7,8,9 న తుడుందెబ్బ రాష్ట్ర మహా సభలు కోమరం భీం పోరాట గడ్డ జోడెన్ ఘాట్ లో జరగనున్నట్లు తెలిపారు,ఈ సభలకు జిల్లా నుండి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు,తుడుందెబ్బ సంఘని బలోపేతం చేయడానికి జిల్లా మండల నాయకులు కృషిచేయాలని,1/70,పేసా చట్టం అటవీ హక్కులు చట్టాలను అమలు దిశగా భూ సమస్యలు హక్కులు పరిష్కారం కోసం ఉద్యమించాలని,త్వరలో జిల్లాలో అన్ని మండల కమిటీలు పూర్తి చేయాలని జిల్లా కమిటీ సభ్యులకు సూచించారు,ఈ కార్యక్రమంలో భండారి సూర్యనారాయణ,దారబోయిన రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఊకె రామక్రిష్ణ,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తంబళ్ళ రవి,ఆర్గానేషన్ సెక్రటరీ తాటి లక్ష్మణ్,కోడెం నరసింహారావు,వాసం పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

# మద్యం ధరలు నియంత్రించాలి....

**సిండికేట్లను, బెల్టు షాపులను రద్దు చేయాలి**
**ఆదివాసి సమాజాన్ని అప్పుల ఊబిలోకి నెట్టుతున్న మద్యం మాఫియా**
**సిండికేట్ మద్యం వ్యాపారం పేరుతో విచ్చలవిడి దోపిడి**
**ఇంకా జరుగుతున్న ఎక్సైజ్ శాఖ అధికారులు ఎందుకు స్పందించడం లేదు**
**అధికార యంత్రాంగం మామూళ్ల మత్తులో జోగుతున్నారా?**
**ప్రతి నెల నెల ముడుపులు అందుతున్నాయా?**
**విజిలెన్స్ అధికారులు ఎక్కడ ఎవరి వాటాలు ఎంత?**
**కోట్ల రూపాయల మనీ లాండరింగ్ జరుగుతున్న ఈడి ఎందుకు ఫోకస్ పెట్టడం లేదు**
**మద్యం మాఫియాను అరికట్టకుంటే వందలాది ఆదివాసులతో భద్రాద్రి జిల్లా ఎక్సైజ్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం**
**జాతీయ ఆదివాసి సంరక్షణ సమితి భద్రాద్రి జిల్లాలి అధ్యక్షులు ఇర్ప రవికుమార్ దొర**



**తొలి సమయం : భద్రాద్రి కొత్తగూడెం ఫిబ్రవరి 25**
ఏజెన్సీ భద్రాద్రి జిల్లాలో మద్యం మాఫియా అరాచకాలకు అడ్డు లేకుండా పోయింది, కోట్ల రూపాయలు దోచుకుంటున్న సంబంధిత శాఖ అధికారులకు సోయి లేకపోవడం దారుణం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మద్యం మాఫియా పలు ప్రాంతాలలో సిండికేట్లను ఏర్పాటు చేసుకొని ఎమ్మార్పీకి కంటే ఎక్కువ ధరలకు మద్యం విక్రయాలు జరుపుతూ ఆదివాసి సమాజాన్ని అప్పుల ఊబిలోకి వెళుతున్నారని జాతీయ ఆదివాసి సంరక్షణ సమితి భద్రాద్రి జిల్లా అధ్యక్షులు ఇర్ప రవికుమార్ దొర ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఇప్పటికే మద్యం మాఫియా పై తమ సంఘం ఆధ్వర్యంలో సమరభేరి మోగించడం జరిగిందని మణుగూరు ఎక్సైజ్ శాఖ అధికారులకు మద్యం మాఫియా ఆగడాలు అరికట్టాలని వినతి పత్రం ఇచ్చినప్పటికీ ఇప్పటికీ స్పందించకపోవడం తమ ఆదివాసులను అవమానపరచడమే అన్నారు. మద్యం మాఫియా ఒక్కొక్క క్వాటర్ బాటిల్ పై బీరు సీసాలపై ఎమ్మార్పీ ధర కంటే 20 నుంచి 30 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్న ఫుల్ బాటిల్ పై వంద రూపాయల వరకు అదనంగా వసూలు చేస్తున్న ఎందుకు స్పందించడం లేదని ఏర్పా రవికుమార్ అన్నారు. ఏజెన్సీ మద్యం దుకాణాలలో మనీలాండరింగ్ జరుగుతున్న వీడి ఎందుకు ఫోకస్ చేయడం లేదన్నారు. ప్రతి నెల నెల అధికారులు మామూలు తీసుకోవడంతోనేనా మద్యం మాఫియా అధిక ధరలకు విక్రయాలు జరుపుతున్నారని అన్నారు.

ఏజెన్సీ ఆదివాసీలను మాఫియాను దోచుకుంటున్న సిండికేట్ వ్యాపారస్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలి. లేనియెడల పినపాక నియోజకవర్గం లోని అన్ని ఎక్సైజ్ స్టేషన్లను వందలాది ఆదివాసులతో ముట్టడిస్తాం.

## వాలీబాల్ టోర్నమెంట్‌నీ ప్రారంభించిన మెచ్చా నాగేశ్వరరావు

**అశ్వారావుపేట దమ్మపేట మండలం**



దిబ్బగూడెంలో నిర్వహిస్తున్న దిబ్బగూడెం గ్రామ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ కి ముఖ్య అతిథిగా అశ్వారావుపేట నియోజకవర్గ BRS పార్టీ ఇంచార్జీ మాజీ MLA మెచ్చా నాగేశ్వరరావు హాజరై టోర్నమెంట్ నీ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఎండలు విపరీతంగా ఉన్న నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకుంటూ టోర్నమెంట్ నిర్వహించుకోవాలని. క్రీడల వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగించి క్రీడాకారుల మధ్య స్నేహ బంధాన్ని పెంపొందిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో వారి వెంట నియోజకవర్గ నాయకులు దారా యుగంధర్, అంకత ఉమా మహేశ్వరరావు, మాజీ సర్పంచ్ కునుసొత్తు చిట్టి బాబు,మహిళా నాయకురాలు యట్ల వెంకమ్మ,నలుపు నాగేంద్ర, కె బాలాజీ,తదితరులు ఉన్నారు.

# కేసుల పరిష్కారం కోసం కృషి చేయండి

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి**




**తొలి సమయం: భద్రాద్రి కొత్తగూడెం ఫిబ్రవరి 25**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు లో మార్చి 8న జరిగే జాతీయ అదాలత్ లో ఎక్కువ కేసుల పరిష్కారం కోసం కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి మంగళవారం ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులతో జరిగిన సమీక్ష సమావేశంలో తెలిపారు. ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు తమ కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాలని తెలిపారు. మోటార్ వాహన ప్రమాద బాదితుల కేసులలో కక్షిదారులకు న్యాయం జరగాలని సూచించారు. లోక్ అదాలత్ లో రాజీపడటం వలన కక్షిదారులకు సమయము,డబ్బు వృధా కాజాలదని తెలిపారు. ఇన్సూరెన్స్ కంపెనీ వారిగా పెండింగ్ లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని న్యాయమూర్తి సూచించారు. రాజీ పడదగిన క్రిమినల్, సివిల్, మనోవర్తి, మోటార్ వాహన ప్రమాద కేసులు మరియు బ్యాంకు కేసులను పరిష్కరించుకొనుట కొరకు కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో కొత్తగూడెం మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఏ.నీరజ, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ. సుచరిత కొత్తగూడెం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లక్కినేని సత్యనారాయణ, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి.నిరంజన్ రావు, ఇన్సూరెన్స్ కంపెనీకు సంబంధించి సీనియర్ న్యాయవాదులు గాదే రామచంద్ర రెడ్డి, రావి విజయ్ కుమార్, ఏ. రాంప్రసాద రావు, వి.నాగిరెడ్డి, అంబటి రమేష్, రాజమల్లు, పాల్గొన్నారు.

# ప్రశ్నించే ప్రజా గొంతుక అలుగుబెల్లి నర్సిరెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలి

**- అవినీతి అవకాశవాదులను ఓడించండి - ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్**

**తొలి సమయం నర్సంపేట ఫిబ్రవరి 25:**
ప్రజా సమస్యలపై సమాజం పురోగతిపై సమగ్ర అవగాహన కలిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డికి ఎంసిపిఐ(యు) సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు నర్సిరెడ్డికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి పోరాడే ప్రజా గొంతుకను గెలిపించుకోవాలని కోరారు. సమస్యలపై అవగాహన లేని అవినీతి అవకాశవాద అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. ఈరోజు స్థానిక నర్సంపేట పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ వరంగల్ ఖమ్మం నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గా పోటీ చేస్తున్న టిఎస్ యుటిఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఆరేళ్ల పాటు ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం శాసనమండలి లో ప్రశ్నించి, సమస్యల పరిష్కారానికి గత బిఆర్ ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం లో ముఖ్యమంత్రులు, మంత్రులు, అధికారులతో చర్చించి ఉపాధ్యాయుల పిఆర్ సి, పదోన్నతులు, ఇతర




సమస్యల పరిష్కారానికి కృషి చేశానని అన్నారు. తన పదవికాలంలో ఆరేళ్ల పాటు రెగ్యులర్, కాంట్రాక్ట్ , అవుట్ సోర్సింగ్ లో విద్యా రంగంలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యల ను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్ళి వాటి పరిష్కారం కోసం పనిచేశానని ఆయన అన్నారు. గతంలో లో కెసిఆర్ ప్రభుత్వం 7.5% పిఆర్సి ఇస్తామంటె 30% సాధించడంలో వారు ప్రధాన పాత్ర పోషించారని అన్నారు. పాఠశాలలలో మరమ్మత్తులు, అదనపు గదుల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. ఆరేళ్ల పదవి కాలంలో ప్రభుత్వం తనకు కేటాయించిన తొమ్మిది కోట్ల రూపాయలు విద్యారంగానికి కేటాయించేటట్లు చేసిన ఘనత వారిదే అన్నారు. పాఠశాలలో పారిశుధ్య పనుల కోసం నెలకు పదివేల నుండి ఇరవై వేల రూపాయల వరకు ఇచ్చే విధంగా ప్రభుత్వాన్ని ఒప్పించినట్లు చెప్పారు. రాబోయే మేనెలలో ఉపాధ్యాయ పదోన్నతులు వుంటాయని అయన చెప్పారు. పాత పెన్షన్ విధానం అమలు చేయడానికి ఉద్యోగ సంఘాలతో కలిసి పనిచేస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయ ప్రతినిధిగా శాసనమండలిలో ప్రశ్నించే గొంతుక ఉండే అలుగుబెల్లి నర్సిరెడ్డి ని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# మార్చి 8 నుంచి పండితాపురంలో శ్రీరామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ జాతర

**కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్**

**తొలిసమయం, ఇల్లందు ఫిబ్రవరి 25**
మార్చి నెల ఎనిమిదో తారీకు నుంచి 11 వ తారీకు వరకు కొమ్మి నేపల్లి-పండితాపురం గ్రామంలో వేంచేసియున్న శ్రీ రామలింగేశ్వర స్వామి కళ్యాణం మహోత్సవం సందర్భంగా ప్రతి ఏడాది మహాశివరాత్రి తర్వాత తొమ్మిదవ రోజున ఆనవాయితీ ప్రకారం జాతర కార్యక్రమం ప్రారంభమగునని, మాజీ జెడ్పిటిసి డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పేర్కొన్నారు. ఈరోజు శివాలయం ప్రాంగణంలో జాతరకు సంబంధించి కరపత్రాలు ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ పురాతన కాలం నుండి వందల సంవత్సరాల క్రితం నుండి కొమ్మినేపల్లి- పండితాపురం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం ప్రతి ఏడాది పాల్గొనమాసం శుద్ధ ఏకాదశి నాడు అర్ధరాత్రి 12 గంటలకు జరుగుతుందని, ఈ సందర్భంగా



నాలుగు రోజుల పాటు జరిగే జాతర కార్యక్రమానికి దూర ప్రాంతాల నుండి కూడ దాదాపు 50 వేల మందికి పైగా ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్లు సూర్యాపేట జిల్లాల నుండి భక్తులు పాల్గొంటారని తెలిపారు. గతంలో ఇక్కడ ఎడ్ల పందాలు, కబడ్డీ పోటీలు నిర్వహించడం జరిగిందని, మా చిన్నతనంలో దూర ప్రాంతాల నుండి ఎడ్ల బండ్లు కట్టుకొని వచ్చేవారని గుర్తు చేశారు. మార్చి 8 వ తారీకు స్వామివారి గుడికి తోరణాలంకరణ, 9వ తారీకు కళ్యాణం, పదవ తారీకు ఊరేగింపు కార్యక్రమం, 11 వ తారీకు పూర్ణాహుతి కార్యక్రమం , సందర్భానుసారంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని మల్లి బాబు యాదవ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బానోతు నరసింహ నాయక్ మేకల మల్లికార్జున రావు, పూజారి రామలింగేశ్వర శర్మ, మేకపోతుల మహేష్, భూక్యా నాగేంద్రబాబు పాడిబండ్ల ప్రసాదు జలగం శ్రీను శీలం పుల్లయ్య బండి లక్ష్మీ నర్సు,బండి ఉపేందర్,గుగులోత్ రవి బొమ్మ గాని పిచ్చయ్య, తురక బిక్షం బండి ఎల్లయ్య, దేరంగుల తిరపయ్య, చల్ల మల్లయ్య శివరాత్రి చిన్నబాబు, దొడ్ల వెంకన్న, దరావత్ నాగరాజు, దాసరి గురేష్ అనంతల శ్రీను, చల్ల గోపి చిర్రా అచ్చయ్య కుంచపు కృష్ణ, బొమ్మ గాని శ్రీను చల్ల వీరన్న సూతగాని వీరన్న, వేముల వీరబాబు బత్తుల వీరబాబు బుర్ర రాజాలు, సురభి మంగయ్య, బోనెపల్లి బాబు, తొండల ముత్తయ్య, పల్లె ఉపేందర్ ఉన్నాం ప్రభాకర్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# సంకెళ్లు వేసిన ట్రంపుకు నిరసన తెలుపని కేంద్రం: సిపిఐ




**తొలిసమయం, ఇల్లందు. ఫిబ్రవరి 25**
అమెరికాలోభారతీయులకు సంకెళ్లు వేసి విమానంలో ఇండియా తరలించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వద్ద మోదీ ప్రభుత్వం కనీసం నిరసన కూడా తెలపలేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల నరసింహ విమర్శించారు. మంగళవారం వనపర్తి సిపిఐ ఆఫీసులో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాల నరసింహ మాట్లాడారు. గతంలో భారతీయులను కాళ్లకు చేతులకు సంకెళ్లు వేసి ఇండియాకు తరలించిన చరిత్ర లేదన్నారు. తాము దేశభక్తులమని దేశ గౌరవాన్ని కాపాడుతావని బిజెపి గొప్పలు చెబుతోందన్నారు. వలసదారులనే నెపంతో ఇండియన్ లను సంకెళ్లు వేసి తరలిస్తే కనీసం ఖండించలేని చేతగాని ప్రభుత్వం అన్నారు. ఇటీవల మోదీ ప్రధాని ట్రంపును కలిసారని కనీసం ఈ ప్రస్తావన కూడా ఆయన వద్ద తేలేదని విమర్శించారు. ప్రశ్నిస్తే ఆయన స్నేహితులు అంబానీ ఆదాని వ్యాపారాలకు అమెరికాలో ఎక్కడ చెక్ పెడతారోనని మోదీకి భయమన్నారు.


**కాంగ్రెస్పై వ్యతిరేకత పెరుగుతోంది**
కాంగ్రెస్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల నరసింహ అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో సిపిఐ కాంగ్రెస్కు మద్దతు ఇస్తోందన్నారు. టిఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయకపోవడం పరోక్షంగా బిజెపికి ఆకారం అందించడమే అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు జిల్లాలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి గ్రామ మండల జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేయాలన్నారు. పానుగల్ మండలంతెల్ల రాళ్లపల్లి లో రూ. కోటి రూపాయల విలువగల ప్రభుత్వ క్రీడా ప్రాంగణం భూమిని ప్రైవేటు వ్యక్తుల ఆక్రమణకు ఎమ్మార్వో ఆఫీస్ వద్ద ధర్నా చేసి, నిరసన తెలుపటం అభినందనీయమన్నారు. సమస్య పరిష్కారానికి జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద కూడా ధర్నా చేపట్టాలన్నారు. జిల్లాలోని 27 గ్రామ శాఖల సమావేశాలు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఏప్రిల్ మొదటి వారంలో పార్టీ మండల సభలు జరపాలన్నారు. సిపిఐ వందేళ్ళ ఆవిర్భావ దినం మార్చి 23న వనపర్తి లో ఘనంగా నిర్వహించాలన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు పాల్గొంటారన్నారు. కనీసం 500 మందిని సమీకరించాలని సూచించారు. సమావేశానికి సీనియర్ నాయకుడు జే చంద్రయ్య అధ్యక్షత వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, శ్రీరామ్, రమేష్, మోష ,సి ఎస్ శెట్టి, రవీందర్, గోపాలకృష్ణ, శ్రీహరి, కుతుబ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# సాహితీ కళాశాలలో ఫేర్ వల్ డే వేడుకలు

**తొలిసమయం, ఇల్లందు ఫిబ్రవరి 25**
సాహితి కళాశాలలో నేడు జరిగిన ఫేర్ వెల్ డే వేడుకలు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలతో అంబరాన్ని అంటాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇల్లందు శ్రీ చంద్రభాను మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని తెలిపారు మరియు ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు తమ పిల్లలు పట్ల ఎన్నో ఆశలు పెట్టుకుంటారు కనుక విద్యార్థులు వారి తల్లిదండ్రులను దృష్టిలో ఉంచుకొని ముందుకు అడుగు వేయాలని ఎమోషనల్ అయ్యారు. సివిల్స్ వైపు దృష్టి పెట్టమని సూచించారు, మరో ముఖ్య అతిథి ఇల్లందు మున్సిపల్ కమిషనర్ శ్రీ %జన%. శ్రీకాంత్ గారు మాట్లాడుతూ సమయం అందరికీ ఒకేలా ఉంటుంది. విద్యార్థులు ముఖ్యంగా ఉన్నత శిఖరాలను చేరాలని, వారు సమయం వృధా చేయకుండా చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఇల్లందు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీ . రామలింగేశ్వర రావు గారు మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదివి, పరీక్ష సెంటర్ కు ముందుగానే చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు శ్రీ నాగిరెడ్డి శ్రీ సుధాకర్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు విలువైన సమయాన్ని వృధా చేయకుండా చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ గుజ్జర్లపూడి రాంబాబు గారు మరియు అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.




# నూతన వధూవరులను ఆశీర్వదించిన బట్టు నాయక్



**తొలి సమయం దంతాలపల్లి ఫిబ్రవరి 25**
దంతాలపల్లి మండల మైనారిటీ సెల్ నాయకుడు ఎస్.కె ఇమామ్ సోదరుడి వివాహ రిసెప్షన్ జరిగినది. ఈ కార్యక్రమానికి దంతాలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏ ఏం సి తోరూర్ వైస్ చైర్మన్ బట్టు నాయక్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఏం సి డైరెక్టర్ కొమ్ము వాసు, మండల నాయకులు బొడ్డుపల్లి వెంకన్న, బొల్లు వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

# జోరందుకున్న బిజెపి ఉపాధ్యాయ శాసనమండలి ప్రచారం వరంగల్ ఖమ్మం నల్లగొండ

**బీజేపీ అభ్యర్థి పులి సరోత్తం రెడ్డి**



**తొలి సమయం తొర్రూరు ఫిబ్రవరి 25**
పెద్ద వంగర మండలంలో ఉపాధ్యాయులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు బీజేపీ అభ్యర్థి పులి సరోత్తం రెడ్డి వేసి గెలిపించాలని కోరుతూ ఈరోజు పెద్దవంగర మండల అధ్యక్షుడు బొమ్మరబోయిన సుధాకర్ ఆద్వర్యంలో పెద్దవంగర మండలం లో ని గ్రామాలలో ని స్థానిక ప్రభుత్వ విద్యాసంస్థల్లో విస్తృత ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి మానుకోట జిల్లా ఉపాధ్యక్షులు రంగు రాము గౌడ్ మాజీ ఎంపిటిసి మొహమ్మద్ రహీం ఎమ్మెల్సీ ఎన్నికల మండల కన్వీనర్,కట్టొజ్ భాస్కర్ కౌన్సిల్ మెబార్ సాయిని జాన్సీ, మండల ప్రధాన కార్యదర్శి ముద్దబోయిన రాము బీజేవైఎం మండల అధ్యక్షులు మెరుగు సందీప్ బూత్ అధ్యక్షులు బైనా కిరణ్ కోట కుమార్ రాపోలు అన్వేష్, దేశెట్టి వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారుల దగ్గర కందగడ్డలు కొన్న ఝాన్సీ రెడ్డి




**తొర్రూరు తొలి సమయం ఫిబ్రవరి 25**
రాయపర్తి మండలంలో వివిధ కార్యక్రమాలు ముగించుకొని, పాలకుర్తి వెళ్ళిపోతున్న పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఝాన్సీ రెడ్డి రాయపర్తి మండలంలోని కొలనపల్లి గ్రామంలో ట్రాలీలో అమ్ముతున్న కందగడ్డలను చూసి, తన వాహనాన్ని ఆపి, స్వయంగా రైతుల దగ్గర కందగడ్డలను కొనుగోలు చేశారు. వారు ఈ చర్య ద్వారా రైతుల పట్ల తన అనుబంధాన్ని, ప్రేమను చూపించారు. అలాగే, వారు రైతుల యోగక్షేమాలను తెలుసుకోవడం కోసం వారి ఆవశ్యకతలు, సమస్యలను పట్టుకుని, స్వయంగా వారి పంటలను కొనుగోలు చేశారు అంతేకాకుండా, ఝాన్సీ రెడ్డి గ్రామస్తులకు భరోసా ఇచ్చారు, ఎవరికి ఏ ఆపద వచ్చినా, నియోజకవర్గంలో ఏ విషయం అయినా మమ్మల్ని సంప్రదించండి. మేము మీకు సహాయం చేయడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉన్నాం. అని చెప్పారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ..మీ అందరిలో కలిసి గ్రామస్తులపై ఉన్న ప్రేమను, అనుబంధాన్ని మరింత పెంచుకున్నారు. ఈ విధంగా గ్రామస్తులతో మెలమెలా కలిసి, వారి అవసరాలను తెలుసుకోవడానికి, వారి సంక్షేమం కోసం ఎప్పుడూ కృషి చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

# రేపు పాలకుర్తి సోమన్న సన్నిధికి మాజీ మంత్రి ఎర్రబెల్లి రాక

**లక్ష్మీనరసింహస్వామి సన్నిధానంలో ప్రత్యేక పూజలు**

**తొలి సమయం తొర్రూరు ఫిబ్రవరి 25**
రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖ మాజీ మంత్రి వర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు శివరాత్రి సందర్భంగా శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి సన్నిధారంలో ప్రత్యేక పూజలు చేసి స్వామివారి ఆశీర్వాదం తీసుకోనున్న ఎర్రబెల్లి దయన్న



## యుద్ధాలతో పాఠాలు

# నేర్వని అగ్రదేశాలు!

ఉక్రెయిన్ యుద్ధానికి మూడేళ్లు పూర్తయ్యాయి. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఈ మూడేళ్లలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపింది. అనేక దేశాలు ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రభావితం అయ్యాయి. రష్యా అధినేత పుతిన్ అహంకారం, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ మూర్ఖత్వం కారణంగా ఇరు దేశాల ప్రజలు కూడా తీవ్రంగా నష్టపోయారు. అయినా యుద్ధం అయిపోయిందనడానికి లేకుండా పోయింది. అడపాదడపా దాడులు సాగుతూనే ఉన్నాయి. అలాగే ఇజ్రాయిల్, పాలస్తీనా యుద్ధం కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రస్తుతానికి నివురుగప్పిన నిప్పులా ఉంది. ప్రపంచంలో రాజ్యాధినేతల కారణంగా చిన్నచిన్న దేశాలు చిగురుటాకులా వణుకుతున్నాయి. ఒక్క ఉక్రెయిన్ యుద్ధం కారణంగానే ప్రపంచం ఎంతగా నష్ట పోయిందీ అందరికీ తెలుసు. ప్రధానంగా ధరలపై విపరీత ప్రభావం చూపింది. ఆర్తిక వ్యవస్థలు చిన్నాభిన్నం అయ్యాయి. ఈ సమయంలో అన్ని దేశాలు ఉమ్మడి నిర్ణయం తీసుకుని భవిష్యత్ యుద్ధాల నివారణకు పూనుకోవాలి. మధ్యయుగాల్లో దాడులతో ఆయా దేశాలను కబళించిన రాజ్యకాంక్ష ఉన్న నేతల తరహాలోనే నేటి అగ్రరాజ్యాలు వ్యవహరిస్తున్నాయనడానికి ఎలాంటి సంకోచం అవసరం లేదు. ఇలా సైనిక పాటవం ఉన్న దేశాలు ఇదిగో యుద్ధం అదిగో యుద్ధం అంటూ పరిస్థితులను వేడెక్కించడం కారణంగా ప్రజల బతుకులు ఛిద్రం అవుతున్నాయి. ఇలాంటి పరిస్థితి కొనసాగితే ఇప్పుడు ప్రతి దేశం సైనికంగా బలపడాలి. అలాగే చుట్టుపక్కల ఉన్న దేశాలు సైనిక కూటమిగా ఏర్పడాలి. ఇతరదేశాల దాడులను తట్టుకునేందుకు సైనికంగా బలమైన వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరాన్ని ఉక్రెయిన్ యుద్ధం పాఠాలు నేర్పు తోంది. లేకుంటే ఉక్రెయిన్‌లా లొంగిపోక తప్పదు. ఇటీవలే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉక్రెయిన్ అధినేత జెలెన్÷-స్కీనే తప్పుపట్టారు. ఆయన టర్మ్ అయిపోయిన నేతగా ప్రకటించారు. అలాగే గాజాను ఆక్రమించు కుంటామని అన్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ఆపడానికి రష్యాను కట్టడి చేయడానికి ప్రపంచదేశాల్లో ఏ ఒక్కటీ ప్రయత్నించలేదు. అగ్రరాజ్యాలు తలచుకుంటే ఏ దేశం మీదయినా దాడులు చేయవచ్చని తాజాగా ఉక్రెయిన్ యుద్ధంతో మరోమారు తేలిపోయింది. సైనికపరంగా..ఆర్థికంగా బలంగా ఉంటే చాలని రష్యా, అమెరికాలు తేల్చేశాయి. ఇక అణు సామర్థ్యం ఉంటే అంతే సంగతులు. రేపు చైనా కూడా ఇదే నీతిని అవలంబిస్తుందని వేరుగా చెప్పనక్కర లేదు. పక్కనే ఉన్న తైవాన్ తమ భూభాగమే అని వాదిస్తోంది. అనేకమార్లు దాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేసింది. భారత్‌తో గిల్లి కజ్జాలు పెంచు కుంటోంది. భారత్‌లో ఉన్న అరుణాచల్ తమదే అంటోంది. టిబెట్‌ను అప్పనంగా ఆక్రమించుకుంది చాలక, పాక్‌ను ఎగదోస్తోంది. రెండో ప్రపంచ యుద్ధం తరువాత ప్రపంచం అత్యంత ప్రమాదకరపరిస్థితిలో ఉందని తాజా ఘటనలు రుజువు చేశాయి. గత ప్రపంచ చరిత్రను పరిశీలిస్తే అగ్రరాజ్యాలుగా ఎదిగిన అమెరికా, రష్యాలు దాడులకు తెగబడుతూనే వచ్చాయి. అమెరికన్లు 1975లో వియత్నాం నుంచి నిష్క్రమించారు. 28 సంవత్సరాల అనంతరం 2003లో ఇరాక్‌ను ఆక్రమించారు. సోవియట్ యూనియన్ సైన్యం 1989లో అఫ్ఘానిస్తాన్ నుంచి వెనక్కి వెళ్లిపోయింది. తరవాత తాలిబన్లను అణచివేసే క్రమంలో అమెరికా అఫ్గాన్‌లో పాగా వేసి చేయి కాల్చు కుంది. 33సంవత్సరాల అనంతరం రష్యా సైన్యం ఉక్రెయిన్‌ను దురాక్రమించింది. అమెరికా రష్యాల అగ్రరాజ్య అభిజాత్యాలకు సమస్త ప్రపంచమూ, ముఖ్యంగా వియత్నాం, అఫ్ఘానిస్తాన్, ఇరాక్, ఉక్రెయిన్‌లు భయానక మూల్యాన్ని చెల్లించుకుంటూనే ఉన్నాయి. ఏ చిన్న కారణం దొరికినా అగ్రరాజ్యాలు తమ ప్రతాపం చూపిస్తున్నాయి. రష్యా, అమెరికాల సరసన ఇప్పుడు చైనా కూడా చేరబో తున్నది. తన ప్రతాపం చూపేందుకు అది అడపాదడపా యత్నిస్తూనే ఉంది. భారత్ వంటి పెద్ద దేశాన్ని కూడా అది భయపెడుతూనే ఉంది. ఇలా పొరుగు దేశం ఉక్రెయిన్‌ను రష్యా దురాక్రమించడమే ఇందుకు తాజా ఉదాహరణగా చెప్పుకోవాలి. అగ్రరాజ్యాలు గతంలో పాల్పడిన సైనిక దుస్సాహసాల గురించి ప్రపంచం ఇప్పుడు ఆలోచించాలి. వియత్నాం, ఇరాక్‌లో అమెరికా, అఫ్ఘానిస్తాన్‌లో సోవియట్ యూనియన్ ఇటువంటి దుస్సాహసాలకే పాల్పడ్డాయి. ఆ మూడు సైనిక జోక్యాలు అంతిమంగా విఫలమయ్యాయి. దురాక్రమించుకున్న దేశంలో ప్రజల జీవితాలను ఛిద్రం చేశాయి. ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర ప్రతికూల పర్యవసానాలకు ఈ దురాక్రమణలు దారితీశాయి. 1965లో అధ్యక్షుడు లిండన్ జాన్సన్ వియత్నాంలో అమెరికా జోక్యంతో మొదల య్యింది. అయితే వియత్నాం అమెరికాను నిలువరించడంలో గట్టిగానే పోరాడింది. క్యూబా విషయంలోనూ అమెరికాకు గట్టి ఎదురుదెబ్బే తగిలింది. 1979 డిసెంబర్‌లో అఫ్ఘాని స్తాన్‌ను ఆనాటి సోవియట్ యూనియన్ ఆక్రమించుకుంది. అఫ్ఘాన్‌లో సోవియట్ యూనియన్ ఒక దశాబ్దం పాటు తిష్ఠవేసింది. అయితే రష్యాను వ్యతిరేకించే క్రమంలో అమెరికా తాలిబన్లను సృష్టించింది. విషాద మేమిటంటే సోవియట్ వ్యతిరేక పోరు మత ఛాందసవాదతత్వాన్ని సంతరించుకుంది. అంతర్యుద్ధం కారణంగా అఫ్ఘాన్ శిథిలం అయ్యింది. వియత్నాం నుంచి అమెరికా నిష్క్రమించినట్టుగానే సోవియట్ అఫ్ఘాన్ నుంచి నిష్క్రమించక తప్పలేదు. అఫ్ఘాన్ అనంతరం ఇరాక్‌ను దురాక్రమించేందుకు అమెరికా దాడులు చేసింది. ఇరాక్ వద్ద అణ్వాయుధాలు ఉన్నాయనే కట్టుకథను అమెరికన్ పాలకులు ప్రచారం చేశారు. నిజానికి ఇరాక్‌ను దురాక్రమించుకోవడం అగ్రరాజ్య దురహంకార చర్య తప్ప మరోటి కాదు. అలా అక్కడి సద్దాం ప్రభుత్వాన్ని కూలదోయడమే గాకుండా అతడిని ఉరితీసే వరకు నాటి అధ్యక్షుడు బుష్ నిద్రపోలేదు. ఇలా జరిగిన ఘటనలన్నీ ఇప్పటికీ ప్రపంచాన్ని కలవరపెడుతూనే ఉన్నాయి. వియత్నాం, ఇరాక్‌లు అమెరికాకు భౌగోళికంగా వేల కిలోమీటరల్ దూరంలో ఉన్నాయి. అఫ్ఘానిస్తాన్ సోవియట్ యూనియన్ సరిహద్దులకు సమీపంలో ఉన్న దేశం. ఉక్రెయిన్, రష్యన్ ఫెడరేషన్‌కు పొరుగు దేశం. తాను ప్రపంచ ఏకైక అగ్ర రాజ్యాన్ని కనుక ఎక్కడైనా సరే ఎవరూ తన మాటను జవ దాటకూడదనే అహంకారమే ఇరాక్ ఆక్రమణకు అమెరికాను పురిగొల్పింది. వియత్నాం, అఫ్ఘాన్, ఇరాక్, ఉక్రెయిన్లలో అగ్రరాజ్యాల దాడులు అన్నీ అహంకారపూరితంగా సాగినవే అని చెప్పాలి. అలాగే 1979లో అఫ్ఘాన్‌ను సోవియట్ యూనియన్, ఇప్పుడు ఉక్రెయిన్‌ను రష్యా దురాక్రమించడం పూర్తిగా న్యాయవిరుద్ధం. అధికారంలో ఉన్న అమెరికా, రష్యా నేతల అహంకారమే అందుకు పురిగొల్పాయని భావించాలి. తమకంటే చిన్న వైన, సైనికం గా అంతగా శక్తిమంతం కాని దేశాలను ఆక్రమించుకోవడం తమ హక్కుగా అగ్రరాజ్యాలు భావించడం వల్లనే ఇలాంటి విపత్కర పరిస్థితులను ఇప్పుడు ప్రపంచ దేశాలు చూడాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రపంచ దేశాలు భవిష్యత్ గురించి ఆలోచించాలి.

# క్షయవ్యాధి నిర్మూలనకు కృషి



**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం ఫిబ్రవరి 25**

సుజాతనగర్ భారతదేశంలో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంలో నిర్వహిస్తున్న 100 రోజుల ముమ్మర కృషి కార్యక్రమం నిక్షయ్ షివిర్ లో భాగంగా మంగళవారం సుజాతానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సర్వారం ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ రమేష్ అధ్యక్షతన క్షయ వ్యాధిపై టీబీ సూపెర్వైసర్ అవగాహన, కల్పిస్తూ అనుమానితుల గుర్తింపు, శాంపిల్ సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారు మాట్లాడుతు దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన క్షయ వ్యాధి తీవ్రంగా ఉన్న 347 జిల్లాల్లో తెలంగాణ రాష్ట్రంలో తొమ్మిది జిల్లాలు ఉన్నాయని అందులో మన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఒకటని కాబట్టి క్షయ వ్యాధిపై సమాజంలోని ప్రతి ఒక్కరూ చర్చించుకుని అవగాహన పెంచుకుంటు, దానిని పూర్తిగా నిర్మూలించడానికి సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. లేనిచో క్షయ వ్యాధి బారిన పడి మరణం పొందిన జాబితాలో మనతోపాటు మన కుటుంబ సభ్యులు కూడా ఉండే అవకాశం ఉందని హెచ్చరిస్తూ వ్యాధి లక్షణాలైన 15 రోజులకు మించి దగ్గు, జ్వరం ఆకలి లేకపోవడం బరువు తగ్గిపోవడం, ఆయాసం, అలసట, తేమడలో రక్తం పడటం, మెడ చుట్టూ, సంకలో, గజ్జలో గడ్డలు వంటి ప్రధాన లక్షణాలు ఉన్నవారు గతంలో క్షయ వ్యాధికి మందుల వాడిన వారు మరియు వారి కుటుంబ సభ్యులు దీర్ఘకాలిక వ్యాధులకు మందులు వాడుతున్న వారు, 60 సంవత్సరాలు పైబడిన వారు ఈ వందరోజుల నిక్షయ్ షివిర్ కార్యక్రమంలో పాల్గొని ఉచిత క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ జరిగితే ప్రభుత్వం ఇచ్చే నాణ్యమైన మందులతో వ్యాధిని తగ్గించుకొని తద్వారా మరణాన్ని నివారించుకోవడంతో పాటు కుటుంబ సభ్యులకు మరియు సమాజంలోని ఇతరులకు క్షయ వ్యాధి వ్యాప్తిని నివారించవచ్చని తద్వారా ఈ వ్యాప్తిని భారత సమాజం నుంచి పూర్తిగా నిర్మూలించడం సాధ్యపడుతుందన్నారు అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో క్షయ వ్యాధికి మందులు వాడే ప్రతి వ్యాధిగ్రస్తుడికి వ్యాధి తగ్గేవరకు నిరంతర సూచనలు సలహాలు ఇవ్వడంతో పాటు పోషకాహార నిమిత్తం మందులు వాడే కాలానికి ప్రతి నెల 1000 రూపాయలు ఎకౌంట్ లో వేయడం జరుగుతుంది అని తెలిపారు. లక్షణాలు ఉన్న వారి వద్ద నుంచి 10 సాంపిల్స్ కలెక్ట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం %నజూూ% పున్నమయ్య, మరియు టీబీ సూపెర్వైసర్ , ఏఎన్ఎం, మరియు ఆశ వర్కర్స్, కార్యకర్తలు పాల్గొన్నారు

# డఫోడిల్స్ (సి.బి.యస్.ఈ )పాఠశాలలో ముందస్తుగా శివరాత్రి వేడుకలు

**మన భారతీయ సంస్కృతి యొక్క నిజమైన సారాంశం మనం జరుపుకునే పండుగలలో కనిపిస్తుంది**

**డఫోడిల్స్ (సి.బి.యస్.ఈ )పాఠశాల కరస్పాండెంట్ చింతల నరెందర్**

**చూడముచ్చటగా చిన్నారుల వేషధారణలు**

**శివరాత్రి ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం**

**వేడుకలను దగ్గరుండి చూసుకున్న పాఠశాల కో ఆర్డినేటర్ శశికలను**

**పాఠశాల కరస్పాండెంట్ చింతల నరెందర్ అభినదించారు.**



**తొలిసమయం నర్సంపేట ఫిబ్రవరి. 25.**

మన భారతీయ సంస్కృతి యొక్క నిజమైన సారాంశం మనం జరుపుకునే పండుగలలో కనిపిస్తుంది అని నర్సంపేట పట్టణానికి చెందిన డఫోడిల్స్ (సి.బి.యస్.ఈ )పాఠశాల కరస్పాండెంట్ చింతల నరెందర్ అన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం డఫోడిల్స్ సి.బి.యస్.ఈ పాఠశాలలో ముందస్తుగా శివరాత్రి వేడుకలు చిన్నారులు శివుడు, పార్వతి, విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యం స్వామి గంగాదేవి వేషాలను ధరించి ఆధ్యాత్మికత ఉట్టిపడేలా కనిపించారు.

పాఠశాల ఆవరణం మామిడి తోరణాలతో, అందమైన పుష్పాలతో అలంకరించి పండగవాతావరం ఉట్టిపడేలా వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరెస్పాండంట్ చింతల నరెందర్ మాట్లాడుతూ ఆది దంపతులైన శివ పార్వతులను గురించి, శివరాత్రి ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు వివరించారు.అనంతరం ఈ వేడుకలను దగ్గరుండి చూసుకున్న పాఠశాల కో ఆర్డినేటర్ శశికలను పాఠశాల కరస్పాండెంట్ చింతల నరెందర్ అభినదించారు.ఈ కార్యక్రమం లో పాఠశాల సెక్రటరీ సాయి కీర్తన రోహిత్ , ప్రధానోపాధ్యాయులు అజీముద్దీన్, ఉప ప్రధానోపాధ్యా యులు సి.హెచ్ రీటా,శశికల,హెచ్. ఆర్. డి విజయలక్ష్మి,ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.







# చోరీ కేసులో దొంగలు కొడుకు, కోడలే

**- 70 తులాల బంగారం, 1.5 లక్షల నగదు స్వాధీనం - 24 గంటల్లో కేసును చేదించిన పోలీసులు**

**- అయిదుగురిపై కేసు నమోదు - హుజురాబాద్ ఏసిపి శ్రీనివాస్ జీ..**



**హుజురాబాద్, ఫిబ్రవరి 25**

హుజురాబాద్ లోని ప్రతాపవాడకు చెందిన ప్రతాప రాఘవరెడ్డి ఇంట్లో ఆదివారం అర్థ రాత్రి దొంగలు ఇంట్లోకి చొరబడి 70 తులాల బంగారం తో పాటు ఏడు లక్షలు నగదు దోచుకెళ్లిన ఘటన స్థానికంగా సంచలనగా మారింది కాగా ఈ సంఘ టనలో కొడుకు, కోడలు సూత్రధారిగా పోలీసుల విచారణ లో తేలింది. మంగళవారం ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్ జీ తెలిపినా వివరాల ప్రకారం కన్న కొడుకే తండ్రి ఆస్తి కోసం పథకం ప్రకారం దొంగతనం చేయించాడని పోలీస్ విచారణలో తేలిందని అన్నారు. రాఘవరెడ్డికి ఇద్దరు కుమారులు ఉన్నారని వారిలో పెద్ద కుమారుడు నాగరాజు, అతని భార్య శాలిని కలిసి తండ్రి వద్ద ఉన్న బంగారు నగలు, నగదు కాజేసేందుకే కుట్ర పన్ని తాను నిర్వహించే హొటల్లో పనిచేసే అమీర్ సాయం కోరాడు. అమీర్ కూడా అంగీకరించడంతో ఒక పథకాన్ని అమలు చేయాలనుకున్నారు. అమీర్ కు బంధువైన వరంగల్ జిల్లా మల్కాపూర్ కు చెందిన సమీర్ ని ఈ దొంగతనం చేయాలని కోరడంతో సమీర్ కూడా సరే అని చెప్పి సమీర్ స్నేహితులైన మున్నా, కృష్ణ లను కలుపుకొని ఒప్పందం కు తీసుకున్నాడు. ఆదివారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో నాగరాజు నిర్వహించే హొటల్ కి సమీర్, మున్నా, కృష్ణ కలుసుకున్నారు. హొటల్లోనే దొంగతనం గురించి చర్చించుకుని సుపారి మాట్లాడుకున్నారు. అదే సమయంలో మద్యం తాగేందుకు నాగరాజు అమీర్ కు డబ్బులు మద్యం తీసుకురమ్మని చెప్పగా అమీర్ వెళ్లి తీసుకువచ్చాడు. మద్యం తాగిన అనంతరం పథకం ప్రకారమే ఆదివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో నాగరాజు ఉండే ఇంటిపైకి నలుగురు చేరుకున్నారు. తనపై ఎలాంటి అనుమానం రాకూడదని నాగరాజు కూడా తన ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఇంట్లో పడుకున్నాడు. అంతా నిద్రిస్తున్న సమయంలో మరికొంత మద్యం కావాలని చెప్పడంతో అమీర్ మద్యం తీసుకువచ్చేందుకు బయటకు వెళ్తున్న సమయంలో ముందుగానే అనుకున్న విధంగా రాఘవ రెడ్డి ఇంటి ముందు ఉన్న మోటార్ ఆన్ చేసి వెళ్ళాడు. మోటర్ ఆఫ్ చేయడానికి రాఘవరెడ్డి ఇంట్లో నుంచి ఎవరైనా బయటకు వస్తే దాడికి పాల్పడవచ్చని పన్నాగం పన్నారు.వారు ఊహించినట్లే రాఘవరెడ్డి ఇంట్లో నుంచి వారి సతీమణి మోటర్ ఆఫ్ చేయడానికి తలుపు తీసి బయటకు వచ్చింది. అక్కడే మాటు వేసి ఉన్న ముగ్గురు దుండగులు వెంటనే ఆమెపై దాడి చేసి ఇంట్లోకి చొరబడ్డారు. రాఘవ రెడ్డి తో పాటు భార్య వినోద వారి కూతురు మానసలపై దాడి చేశారు. రాఘవరెడ్డి, వినోదలపై కత్తులతో దాడి చేసి వారి వద్ద ఉన్న 70 తులాల బంగారం తో పాటు లక్ష 50 వేల రూపాయల నగదు పట్టుకొని పారిపోయారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101